DD9 వార్త
తెలుగు దినపత్రిక

కాలాన్ని వృథాగా
గడుపుకుంటూ పోతే
గతం అవుతుంది
గెలుచుకుంటూ పోతే
చరిత్ర అవుతుంది

## సైబర్ నేరగాళ్లు



04

సంపుటి : 01 సంచిక : 206 హైదరాబాద్, మార్చి, మంగళవారం 17, 2026 పేజీలు : 08 వెల : 3.00



02

## డ్రగ్ టెస్టులు తప్పనిసరి చేయాలి

- రాజకీయాలు, సినిమా రంగంలో అమలవ్వాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డిమాండ్
- పైలట్ రోహిత్ రెడ్డి ఘటనతో కలకలం
- డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు
- ప్రజాప్రతినిధులకు తప్పనిసరి టెస్టులపై వినతి
- సినీ తారలు కూడా పరీక్షలు చేయించుకోవాలని పిలుపు
- లేదంటే సినిమా విడుదలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్
- రాజకీయంగా చర్చకు దారి తీస్తున్న డ్రగ్స్ వ్యవహారం

## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- 2025వ సంవత్సరానికి పురస్కారాలు ప్రకటించిన కేంద్రం
- దేశంలోని 24 భాషల్లో ఉత్తమ రచనలకు సాహిత్య అవార్డులు
- కరోనా కాలపు సామాజిక పరిస్థితులను ప్రతిబింబించిన 'అనిమేష'కు గుర్తింపు
- మార్చి 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం
- విజేతలకు తామ్రపత్రం, శాలువా, లక్ష రూపాయల నగదు బహుమతి
- కవిత్వం, నవలలు, కథలు, వ్యాసాలు సహా పలు ప్రక్రియలకు అవార్డులు
- తెలుగు సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేసిన రచయితకు మరో ఘనత



03



# ప్రపంచ దిక్సూచిగా తెలంగాణ

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్

- అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం
- బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- 20 ఏళ్లలో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- హైదరాబాద్ అభివృద్ధికి జీహెచ్ఎంసీని విభజన
- మూసీ నది పునరుద్ధరణకు 55 కి.మీ. అభివృద్ధి ప్రణాళిక
- రైతు భరోసా ద్వారా 65 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశాలు తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభమయ్యాయి. అనంతరం వందేమాతరం, తర్వాత జాతీయ గీతం జనగణమన ఆలపించారు. ఆ తర్వాత గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలుగులోనే తన ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్ రాష్ట్ర చరిత్ర, అభివృద్ధి, ప్రభుత్వ విధానాలపై విస్తృతంగా మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం సుదీర్ఘ చారిత్రాత్మక పోరాటాల ఫలితంగా ఏర్పడిందని ..మిగతా 2లో

# భవిష్యత్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

## ప్రజా ప్రభుత్వ 3వ బడ్జెట్‌కు గవర్నర్ ప్రసంగమే మార్గదర్శకం

- గత ప్రభుత్వాలపై చర్చించాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- ప్రజా ప్రభుత్వ 3వ బడ్జెట్‌కు గవర్నర్ ప్రసంగమే మార్గదర్శకం
- అసెంబ్లీ సమావేశాల వ్యూహంపై కాంగ్రెస్ సమావేశంలో చర్చ
- చర్చలు పక్కదారి పడకుండా ముందుకు వెళ్లాలని సూచన
- ఎమ్మెల్యేలు సభకు తప్పకుండా హాజరు కావాలని హెచ్చరిక
- మహిళా సభ్యులు చర్చల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపు
- ఇతర రాష్ట్రాల విధానాలు అధ్యయనం చేయాలని సూచన
- వేసవి తాగునీటి సమస్యపై ప్రజల మధ్య పనిచేయాలని ఆదేశం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభా పక్షం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వాల వైఫల్యాల గురించి మాట్లాడటానికి ఒక హద్దు ఉంటుందని, ఇక నుంచి రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేయబోయే పనులు, అభివృద్ధి ప్రణాళికలపై సభ్యులు ఎక్కువగా మాట్లాడాలని సూచించారు.శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన ..మిగతా 2లో

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

- బ్రిక్స్ వేదికగా భారత్ స్పందనపై రాజకీయ దుమారం
- బ్రిక్స్ అధ్యక్షదేశంగా సమష్టి ప్రకటన చేయలేదన్న కాంగ్రెస్
- అమెరికా, ఇజ్రాయెల్‌తో సంబంధాల కోసమే మౌనమని ఆరోపణ
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దౌత్య మార్గాలే పరిష్కారమని వెల్లడి
- ఇరాన్‌పై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు
- పార్లమెంట్‌లో పూర్తిస్థాయి చర్చ జరపాలని కాంగ్రెస్ డిమాండ్
- విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటనపై ప్రతిపక్ష అసంతృప్తి



03



02

## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ?

### "తెలంగాణను ఏటీఎంగా మార్చారు"

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపణ
- 100 రోజుల్లో హామీలని రెండున్నరేళ్లు గడిచాయని విమర్శ
- రైతుబంధు, రైతుభరోసా అమలు కాకపోవడంపై అసంతృప్తి
- బలహీన వర్గాల బడ్జెట్, దళిత హామీలపై స్పష్టత లేదని వ్యాఖ్య
- మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల హామీలపై ప్రశ్నలు
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక



## అసెంబ్లీ వారం రోజులు కూడా నడవదు

- అసెంబ్లీ షెడ్యూల్‌పై హరీష్ రావు విమర్శలు
- పండుగలతో పనిదినాలు తగ్గాయని ఆరోపణ
- బడ్జెట్ చర్చకు సమయం సరిపోదన్న అభిప్రాయం
- ఆదివారం సభకు తమకు అభ్యంతరం లేదన్న హరీష్ రావు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో పనిదినాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇది ప్రజా సమస్యలపై చర్చను నీరుగార్చడమేనని ఆయన ఆరోపించారు. ఈ నెల 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి సభ నడిచేది వారం రోజులు కూడా ఉండదని హరీష్‌రావు పేర్కొన్నారు. సమావేశాల మధ్యలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పండుగలతో పాటు రెండు ఆదివారాలు వస్తున్నాయని, ఆ ఐదు సెలవు దినాలను మినహాయిస్తే చర్చకు చాలా తక్కువ సమయం మిగులుతుందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. సమావేశాల అజెండాపై క్లారిటీ ఇస్తూ, మార్చి 17 , 18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుందని, ఆ తర్వాత మార్చి 20వ తేదీన ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని ఆయన వెల్లడించారు. అయితే, బడ్జెట్ వంటి కీలక అంశంపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండా ప్రభుత్వం షెడ్యూల్‌ను కుదించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ సెలవుల వల్ల తగ్గిన పనిదినాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం మార్చి 29వ తేదీ ఆదివారం నాడు కూడా సభను ..మిగతా 2లో

# భవిష్యత్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

మొదటిపేజీ తరువాయి

వేం నరేందర్ రెడ్డిని ఈ సందర్భంగా సీఎల్పీ సభ్యులు అభినందించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు బడ్జెట్లు ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు మూడో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో గవర్నర్ చేసిన ప్రసంగం ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలు, అమలు చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా వివరించబడ్డాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల సభ్యులు కూడా ఆ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చలు సమర్థవంతంగా సాగేందుకు పార్టీ సభ్యుల మధ్య సమన్వయం అవసరమని సీఎం అన్నారు. ముఖ్యంగా సభలో మాట్లాడే అంశాలపై విప్‌లతో ముందుగానే చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సభ్యులు మాట్లాడే విషయాలు పక్కదారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సభ సమయాన్ని వృథా చేయకుండా నిర్మాణాత్మక చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు ఎదురైన అనుభవాలను కూడా సీఎం గుర్తు చేశారు. గతంలో ప్రతిపక్ష సభ్యులకు సభలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని ఆయన అన్నారు. సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని చెప్పారు. జానారెడ్డి వంటి సీనియర్ నాయకులకు కూడా మైక్ ఇవ్వకుండా సభ నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. తనను కూడా ఒక సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సభకు రాకుండా చేసిన సంఘటనలను ఆయన ప్రస్తావించారు.అలాంటి పరిస్థితులు ఇప్పుడు ఉండకూడదని సీఎం అన్నారు. ప్రజాస్వామ్య విధానాలను గౌరవిస్తూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సభలో ప్రతిపక్షం కూడా మాట్లాడే అవకాశం పొందాలని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే సభలో చర్చలు సజావుగా సాగేందుకు సభ్యులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

అసెంబ్లీ సమావేశాల హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించకూడదని సీఎం హెచ్చరించారు. ప్రతి సభ్యుడు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలని అన్నారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యులు కూడా చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. మహిళా సభ్యుల అభిప్రాయాలు సభలో ప్రతిఫలించడం అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలపై మహిళా సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అన్నారు. అసెంబ్లీ కమిటీల ఏర్పాటు గురించి కూడా సీఎం మాట్లాడారు. శాసనసభ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజా సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. కమిటీల ద్వారా ప్రభుత్వ విధానాల అమలును పరిశీలించవచ్చని చెప్పారు. అదే విధంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్న మంచి కార్యక్రమాలను తెలంగాణలో కూడా అమలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.

రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని సీఎం అన్నారు. ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం కన్నా వ్యవస్థను బలపర్చడం ముఖ్యం అని చెప్పారు. వ్యక్తిగత విమర్శలు రాజకీయ వ్యవస్థను దెబ్బతీస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యవస్థ బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం నిలుస్తుందని అన్నారు. పార్టీ మరియు ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సభ్యులు స్పందించాలని సీఎం సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించాలని సూచించారు.

ఇప్పుడు ప్రభుత్వం రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళికలు భవిష్యత్తు ఎన్నికలకు కూడా కీలకంగా మారతాయని సీఎం అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందిస్తున్న రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుంచాల్సి ఉంటుందని చెప్పారు. అందువల్ల ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.వేసవి కాలం నేపథ్యంలో తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సీఎం సభ్యులకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా స్థానికంగా పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.

ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో కలిసిమెలిసి పనిచేయాలని సూచించారు.మొత్తంగా ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ విధానాల ప్రచారం వంటి అంశాలపైసభ్యులుదృష్టిపెట్టాలనిసీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

# "ప్రపంచ దిక్సూచిగా తెలంగాణ"

మొదటిపేజీ తరువాయి



గవర్నర్ గుర్తుచేశారు. ఈ రాష్ట్ర నిర్మాణం కోసం అనేక మంది ప్రజలు త్యాగాలు చేశారని అన్నారు. ఆ త్యాగాలను గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా పాలన స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలోని ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమాన అవకాశాలు అనే మూడు ప్రధాన లక్ష్యాలతో పరిపాలన సాగుతోందని అన్నారు. తెలంగాణను దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా గుర్తింపు పొందే రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గవర్నర్ వివరించారు. అలాగే 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు చేర్చే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం పలు రంగాల్లో సంస్కరణలు చేపడుతోందని చెప్పారు. గత సంవత్సరం కాలంలో ప్రభుత్వం అనేక కీలక సంస్కరణలు చేపట్టిందని గవర్నర్ గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి పునాదులు వేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవితం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధిపై కూడా గవర్నర్ తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జీహెచ్‌ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని తెలిపారు. ఇది పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకున్న నిర్ణయం అని చెప్పారు.పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా నగరం మధ్యలో ఉన్న పరిశ్రమలను నగర శివార్లకు తరలించే చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. ఇందుకోసం హిల్ట్ పాలసీని ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించామని వివరించారు.

రోడ్ల అభివృద్ధిపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని గవర్నర్ చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్‌కు అనుసంధానంగా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ మరియు రీజినల్ రింగ్ రోడ్ మధ్య అనుసంధానం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.అలాగే తెలంగాణను ఇతర రాష్ట్రాలతో అనుసంధానం చేసే రహదారుల నిర్మాణం కూడా జరుగుతోందని గవర్నర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతితో కనెక్టివిటీ కల్పించేలా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. దీనివల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

శంషాబాద్‌ను బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉందని గవర్నర్ చెప్పారు. రాష్ట్రంలో విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయడానికి వరంగల్ మరియు ఆదిలాబాద్ ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.హైదరాబాద్ పరిసరాల్లో అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును కూడా గవర్నర్ ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేక అథారిటీని గత సంవత్సరం మార్చి నెలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

మూసీ నది అభివృద్ధి ప్రణాళికను కూడా గవర్నర్ వివరించారు. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీ నది పునరుద్ధరణ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా నదిని శుభ్రపరచడం, పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని గవర్నర్ అన్నారు. ప్రజలకు భద్రత కల్పించేందుకు నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

సామాజిక న్యాయం అంశంపై కూడా గవర్నర్ ప్రస్తావించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని చెప్పారు. బీసీల జనాభా వివరాలను తెలుసుకునేందుకు కులగణన సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ వివరాల ఆధారంగా బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చట్టం రూపొందించామని చెప్పారు.అదే విధంగా ఎస్సీ వర్గీకరణ అంశంలో కూడా ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందని గవర్నర్ తెలిపారు. ఎస్సీల్లోని వివిధ ఉప కులాలకు సమాన న్యాయం జరిగేలా ఈ చట్టం రూపొందించామని చెప్పారు. ఈ విషయంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలో కూడా తెలంగాణ రాష్ట్రం మంచి పురోగతి సాధించిందని గవర్నర్ అన్నారు. రాష్ట్రంలో 236 లక్షల టన్నుల వరి ఉత్పత్తి సాధించామని తెలిపారు. దీంతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు.రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని గవర్నర్ తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే ఎనిమిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా సుమారు 65 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని వివరించారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గవర్నర్ చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఇప్పటివరకు 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వివరించారు.పేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని గవర్నర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు.ఇదిలా ఉండగా అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అసెంబ్లీకి చేరుకున్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు.

ఆ తర్వాత గవర్నర్, ముఖ్యమంత్రి మరియు మంత్రులు కలిసి మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పునరుద్ధరించిన కౌన్సిల్ భవనం ముందు ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గవర్నర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అయితే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ సభ్యులు బహిష్కరించారు.మొత్తంగా తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలపై గవర్నర్ చేసిన ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది.

# అసెంబ్లీ వారం రోజులు కూడా నడవదు

మొదటిపేజీ తరువాయి

నిర్వహించాలని భావిస్తోంది.

దీనిపై స్పందించిన హరీష్ రావు, ఆదివారం నాడు సభ పెట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమకు కావాల్సింది కేవలం చర్చకు తగిన సమయం మాత్రమేనని, ప్రజల పక్షాన గళం వినిపించేందుకు తాము ఎప్పుడూ సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదింపజేసుకోవాలని చూస్తోందని, దీనివల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ఆయన విమర్శించారు.



# ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ?

- "తెలంగాణను ఏటీఎంగా మార్చారు"
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపణ
- 100 రోజుల్లో హామీలని రెండున్నరేళ్లు గడిచాయని విమర్శ
- రైతుబంధు, రైతుభరోసా అమలు కాకపోవడంపై అసంతృప్తి
- బలహీన వర్గాల బడ్జెట్, దళిత హామీలపై స్పష్టత లేదని వ్యాఖ్య
- మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల హామీలపై ప్రశ్నలు
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణను అభివృద్ధి దిశగా నడిపించాల్సిన ప్రభుత్వం రాష్ట్రాన్ని ఒక "ఏటీఎం"గా మార్చి ఏఐసీసీకి సమర్పిస్తున్నదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి సరైన శ్రద్ధ లేదని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి పేద మనిషి తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, శాసనసభలో ఈ అంశాలపై గట్టిగా నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

తెలంగాణ అసెంబ్లీ మరియు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కావడంతో ముందు గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు కేటీఆర్ నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారికి ఘనంగా నివాళులు సమర్పించారు. విద్యార్థి అమరవీరుల త్యాగం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన అన్నారు. వారి ఆశయాలను స్మరించుకుంటూ శాసనసభ సమావేశాలకు హాజరవుతున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ నాయకులు 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అంతేకాదు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశంలో వాటికి చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారని తెలిపారు. అయితే ఇప్పుడు రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు.

గతంలో గవర్నర్ ప్రసంగంలో కూడా ఈ హామీల గురించి ప్రభుత్వం ప్రకటించిందని కేటీఆర్ గుర్తు చేశారు. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగంలో కూడా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారని అన్నారు. ముఖ్యమంత్రి సంతకం చేసిన ఆ ప్రసంగంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీలకు చట్టబద్ధత ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం ఇది మూడో గవర్నర్ ప్రసంగం అయినప్పటికీ ఇప్పటికీ ఆరు గ్యారెంటీల అమలుపై ఎలాంటి స్పష్టత లేదని కేటీఆర్ అన్నారు.

రైతుల పరిస్థితి గురించి మాట్లాడుతూ కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కాలంలో రైతులకు పంటలు నాటే సమయానికి రైతుబంధు నిధులు అందేవని చెప్పారు. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని విమర్శించారు. ఇప్పుడు పంటలు కోతలకు వచ్చినా రైతుబంధు డబ్బులు రైతులకు అందడం లేదని అన్నారు. రైతులకు ఎప్పుడు నిధులు అందిస్తారో ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదని విమర్శించారు.

ఈ నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ తెలిపారు. "రాహుల్ బంధు కాదు, రైతుబంధు ఇవ్వాలి" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. రైతులకు సహాయం చేయాల్సిన ప్రభుత్వం వేరే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్ టెస్టులు తప్పనిసరి చేయాలి

- రాజకీయాలు, సినిమా రంగంలో అమలవ్వాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డిమాండ్
- పైలట్ రోహిత్ రెడ్డి ఘటనతో కలకలం
- డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు
- ప్రజాప్రతినిధులకు తప్పనిసరి టెస్టులపై వినతి
- సినీ తారలు కూడా పరీక్షలు చేయించుకోవాలని పిలుపు
- లేదంటే సినిమా విడుదలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్
- రాజకీయంగా చర్చకు దారి తీస్తున్న డ్రగ్స్ వ్యవహారం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన ఒక ఘటనతో ఈ విషయం రాజకీయాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో పోలీసులకు పట్టుబడినట్లు వెలుగులోకి రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ మొదలైంది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో తీవ్ర స్పందనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగంపై ప్రభుత్వ వైఖరి, రాజకీయ నాయకుల పాత్ర వంటి అంశాలు ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి.ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకులు కూడా స్పందిస్తున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డ్రగ్స్ వ్యవహారంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియాతో జరిగిన అనౌపచారిక సంభాషణలో ఆయన ఈ విషయంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. డ్రగ్స్ సమస్య కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని పలు రంగాల్లో వ్యాపించిందని ఆయన అన్నారు. ముఖ్యంగా సినిమా పరిశ్రమలో డ్రగ్స్ ప్రభావం ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. సమాజంలో డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అనిరుధ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయంలో ఆదర్శంగా ఉండాలని అన్నారు. అందుకే ప్రజాప్రతినిధులకు నిర్దిష్ట వ్యవధిలో డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా జీవనంలో ఉన్న ప్రముఖులు డ్రగ్స్ వినియోగం నుంచి పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన అన్నారు.అదే సమయంలో సినిమా రంగానికి కూడా ఈ నిబంధనలు వర్తించాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. సినీ నటులు, దర్శకులు, నిర్మాతలు, ఇతర ప్రముఖులు కూడా నిర్దిష్ట కాల వ్యవధిలో డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ టెస్ట్ చేయించే విధంగా నిబంధనలు తీసుకురావాలని అన్నారు. ఇది అమలులోకి వస్తే డ్రగ్స్ వినియోగాన్ని కొంతవరకు నియంత్రించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

సినిమా రంగంలో పనిచేసే ప్రముఖులకు డ్రగ్స్ పరీక్షలు తప్పనిసరి చేస్తే పరిస్థితి మారుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక సినిమా విడుదలకు ముందు అందులో పనిచేసిన ముఖ్య వ్యక్తులు డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలనే నిబంధన ఉండాలని అన్నారు. ఆ పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే సినిమాలకు విడుదల అనుమతి ఇవ్వాలని సూచించారు. పరీక్షలు చేయించుకోకుండా సినిమాలు విడుదల చేయకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఇదే విధంగా ప్రజాప్రతినిధుల విషయంలో కూడా కఠిన నిబంధనలు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వంటి ప్రజాప్రతినిధులు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోకపోతే ప్రజల్లో అనుమానాలు కలుగుతాయని చెప్పారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన నాయకులు డ్రగ్స్ వినియోగంపై స్పష్టమైన సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. డ్రగ్స్ పరీక్షలు చేయించుకోని ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి అనుమతించకూడదని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో పట్టుబడిన ఘటన రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించినట్లు సమాచారం. అనంతరం ఆయనను రిమాండ్‌కు పంపినట్లు తెలిసింది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గతంలో కూడా తెలంగాణలో డ్రగ్స్ వ్యవహారం పలు సందర్భాల్లో చర్చకు



వచ్చింది. అప్పటి నుంచి ఈ సమస్యపై వివిధ రాజకీయ పార్టీలు ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకుంటూ వచ్చాయి. ముఖ్యంగా గత ప్రభుత్వ కాలంలో డ్రగ్స్ వినియోగం పెరిగిందని కొందరు నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను అప్పటి ప్రభుత్వం ఖండించింది.

ఇప్పుడు ఈ తాజా ఘటనతో మళ్లీ డ్రగ్స్ వ్యవహారం రాజకీయ చర్చగా మారింది. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీపై ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు కాంగ్రెస్ నాయకులు డ్రగ్స్ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలంటే కేవలం చట్టపరమైన చర్యలు మాత్రమే కాకుండా సామాజిక అవగాహన కూడా అవసరమని నిపుణులు చెబుతున్నారు. యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

## ప్రజా పాలన ప్రగతిప్రణాళికలో భాగంగా నేడు బజార్ హత్నూర్లో వైద్య శిబిరం ఏర్పాటు.

- **రిమ్స్ నుంచి ప్రత్యేక డాక్టర్ల బృందం రాక**

**బజార్హత్నూర్, మార్చి 16(డిడి9 వార్త )**

బజార్ హత్నూర్ మండల కేంద్రంలో తేదీ 17 న మంగళవారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యాదికారులు(ఆదిలాబాద్ రిమ్స్ డాక్టర్లు,స్త్రీ వైద్యనిపుణులు,పిల్లలు వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, దంత వైద్య నిపుణులు, ఎముకలు వైద్య నిపుణులు జనరల్ ఫిజిషియన్)ఉదయము 9:00 నుంచి 4:00గంటలకు వరకు ఉండి వైద్య పరీక్షలు,చికిత్సలు సూచనలు ఇవ్వనున్నారని బజార్ హత్నూర్ మండల వైద్య అధికారి కుర్సెంగే భీంరావ్ సోమవారం రోజు తెలిపారు. ఈ కార్యక్రమము ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బజార్ హత్నూర్లో కలదని,కాన ,కార్యక్రమములో ప్రతి ఒక్కరు హాజరు కావాలనికోరారు.అలాగే గతంలో చికిత్స పొందిన ఏ వ్యాదికి సంబందించిన పాత రిపోర్ట్స్ ఏవైనా ఉంటే అవి కూడా తీసుకొని శిబిరంకు తీసుకొని రాగలరని డాక్టర్ పేర్కొన్నారు.

## బడి పిల్లల నీటి అవసరం తీర్చుటకు పంచాయతీ నిధులతో బోరుబావి వేయించిన సర్పంచ్ పర్చ సాయన్న.

**బజార్హత్నూర్ మార్చి 16(డిడి9వార్త ):-**

బజార్ హత్నూర్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిపిల్లలకు నీటి అవసరం గుర్తేరిగిన బజార్ హత్నూర్ సర్పంచ్ పర్చ సాయన్న గ్రామ పంచాయతీ నిధులతో సోమవారం రోజు ఒక బోరు బావిని తవ్వించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జె భూమన్న, మిగిలిన సహాయఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు లక్కం శంకర్,పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## బోథ్ సివిల్ ఆసుపత్రి సూపరిడెంట్ డా. రవీంద్ర ప్రసాద్ ను సన్మానించిన బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు




**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 16(డి డి 9):-**

బోథ్ ప్రధాన ఆసుపత్రికి డా. రవీంద్ర ప్రసాద్ ను నియమించడంతో హాస్పిటల్ సిబ్బంది, బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షులు సురేష్ వైద్య, ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు.. ప్రజలకు సేవాలందించడంలో ముందున్నా డా.రవీంద్ర ప్రసాద్ సేవలను కొనియాడారు మళ్లీ బోథ్ కు తిరిగి రావడం బోథ్ ప్రజలకు శుభ నుచికమని అన్నారు.. ఈ కార్యక్రమంలో బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు ప్రధాన కార్యదర్శి బుస లక్ష్మణ్, కోశాధికారి కొట్టాల రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎలుక రాజు. సలహాదారులు మెర్గు భోజన్న. తదితరులు పాల్గొన్నారు.




## నిజామాబాద్ జిల్లాలో పోలీస్ ఆంక్షలు

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**



నిజామాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సౌకర్యార్థం పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16 నుండి 31 వరకు అమలులో ఉండే ఈ నిబంధనల ప్రకారం... జిల్లా కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన చేయడం నిషిద్ధం. శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జేల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. ఏవైనా సభలు లేదా ఊరేగింపులు నిర్వహించాలంటే పోలీసు అనుమతి తప్పనిసరి అని, 500 మందికి పైగా హాజరయ్యే కార్యక్రమాలకు 72 గంటల ముందే సీపీ అనుమతి తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. డ్రోన్ల వినియోగంపై ఆంక్షలు విధిస్తూ, వాటి వాడకానికి ఏవియేషన్ మరియు పోలీసు శాఖల క్లియరెన్స్ అవసరమని సీపీ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని థియేటర్లలో ఎ సర్టిఫికేట్ సినిమాలకు మైనర్లను అనుమతించకూడదని హెచ్చరించారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్తవారికి ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని ఎస్.హెచ్.ఓలు ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

- **బ్రిక్స్ వేదికగా భారత్ స్పందనపై రాజకీయ దుమారం**
- **బ్రిక్స్ అధ్యక్ష దేశంగా సమష్టి ప్రకటన చేయలేదన్న కాంగ్రెస్**
- **అమెరికా, ఇజ్రాయెల్‌తో సంబంధాల కోసమేమౌనమని ఆరోపణ**
- **పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దౌత్య మార్గాలే పరిష్కారమని వెల్లడి**
- **ఇరాన్‌పై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు**
- **పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరపాలని కాంగ్రెస్ డిమాండ్**
- **విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటనపై ప్రతిపక్ష అసంతృప్తి**

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**



పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై దేశీయ రాజకీయాల్లో చర్చలు ముదురుతున్నాయి. ముఖ్యంగా బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్ష దేశంగా వ్యవహరిస్తున్న సమయంలో ఆ వేదిక నుంచి సమష్టి ప్రకటన విడుదల చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. పశ్చిమాసియా పరిస్థితులపై భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తీసుకోలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యల ప్రకారం బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న దేశంగా భారత్ అంతర్జాతీయ స్థాయిలో స్పష్టమైన స్పందన ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఇప్పటివరకు పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న సంఘటనలపై బ్రిక్స్ తరఫున సమష్టి ప్రకటన చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రాలేదని ఆయన విమర్శించారు. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా మరియు ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన వైమానిక దాడులపై భారత ప్రభుత్వం నేరుగా స్పందించలేదని అన్నారు. ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలోని సైనికేతర లక్ష్యాలపై ఇరాన్ చేపడుతున్న దాడులు, హిందూ మహాసముద్రంలో జరిగిన నౌకాదళ ఘటనలపై కూడా స్పష్టమైన సమష్టి ప్రకటన చేయడానికి కేంద్రం ముందుకు రాలేదని పేర్కొన్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సంతృప్తిపర్చాలనే ప్రయత్నం కారణంగా కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ అంశాల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. అలాగే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలను దృష్టిలో పెట్టుకుని కూడా భారత్ స్పష్టమైన ప్రకటన చేయడం లేదని జైరాం రమేశ్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా వ్యవహరించడం వల్ల బ్రిక్స్ కూటమి అధ్యక్ష దేశంగా భారత్‌కు ఉన్న ప్రాధాన్యత తగ్గిపోతుందని ఆయన అన్నారు.

పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కాంగ్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2025 జూన్ 13 నుంచి ఇరాన్‌పై జరుగుతున్న సైనిక దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పార్టీ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు వ్యతిరేకంగా జరిగే చర్యలు ప్రాంతీయ స్థిరత్వానికి ప్రమాదకరమని కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో యుద్ధ చర్యలను వెంటనే ఆపి శాంతి పునరుద్ధరణకు ప్రయత్నాలు చేయాలని సూచించింది. సమస్యలను హింసాత్మక మార్గాల్లో కాకుండా దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ హత్య ఘటనపై కూడా కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. ఈ విషయంపై గత వారం కూడా కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. అమెరికా మరియు ఇజ్రాయెల్‌తో ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం నేరుగా స్పందించడం లేదని ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతాలపై ఇరాన్ దాడులను భారత్ ఖండించినప్పటికీ, ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడుల విషయంలో మాత్రం మౌనం పాటించిందని కాంగ్రెస్ అభిప్రాయపడింది.

పశ్చిమాసియా పరిస్థితుల ప్రభావం భారతదేశంపై కూడా పడే అవకాశం ఉన్నందున ఈ అంశంపై పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. లోక్‌సభ మరియు రాజ్యసభలో ఈ విషయాన్ని చర్చకు తీసుకురావాలని ప్రతిపక్షం కోరింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్చకు అనుమతించడంలో ఆసక్తి చూపడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. పార్లమెంట్‌లో చర్చ జరిగితే విదేశాంగ విధానంపై ఉన్న లోపాలు బయట పడతాయని ప్రభుత్వం భావిస్తున్నదని కాంగ్రెస్ నాయకులు అన్నారు.

ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల పార్లమెంట్‌లో పశ్చిమాసియా పరిస్థితులపై ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అక్కడి పరిణామాలను భారత్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నదని తెలిపారు. పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారకుండా ఉండేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు అవసరమని చెప్పారు. సమస్యలకు శాంతియుత పరిష్కారం కనుగొనాలని భారత్ నమ్ముతుందని ఆయన స్పష్టం చేశారు.

పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయుల భద్రత మరియు సంక్షేమం కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని జైశంకర్ పేర్కొన్నారు. అక్కడి పరిస్థితులపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా పరిస్థితులను దగ్గరగా గమనిస్తున్నారని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి భంగం కలిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అయితే విదేశాంగ మంత్రి చేసిన ఈ ప్రకటనతో కాంగ్రెస్ నేతలు సంతృప్తి వ్యక్తం చేయలేదు. పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ అవసరమని మళ్లీ డిమాండ్ చేశారు. జైశంకర్ చేసిన ప్రకటన సరిపోదని కాంగ్రెస్ అభిప్రాయపడింది. పశ్చిమాసియా పరిస్థితులపై స్పష్టమైన విధానం వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ అంశంపై పార్లమెంట్‌లో కూడా ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు. లోక్‌సభలో కూడా కాంగ్రెస్ సభ్యులు నిరసనలు చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. పశ్చిమాసియా సంక్షోభం వంటి ముఖ్యమైన అంతర్జాతీయ అంశంపై ప్రభుత్వం పార్లమెంట్‌ను నమ్మకంగా తీసుకోవాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది.

మొత్తంగా చూస్తే పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు భారతదేశ రాజకీయాల్లో కూడా చర్చకు దారి తీస్తున్నాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం పరిస్థితులను సమీక్షిస్తూ దౌత్యపరమైన పరిష్కారాన్ని కోరుతుండగా, మరోవైపు ప్రతిపక్షం ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ అంశంపై పార్లమెంట్‌లో మరింత చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- **2025వ సంవత్సరానికి పురస్కారాలు ప్రకటించిన కేంద్రం**
- **దేశంలోని 24 భాషల్లో ఉత్తమ రచనలకు సాహిత్య అవార్డులు**
- **కరోనా కాలపు సామాజిక పరిస్థితులను ప్రతిబింబించిన 'అనిమేష'కు గుర్తింపు**
- **మార్చి 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం**
- **విజేతలకు తామ్రపత్రం, శాలువా, లక్ష రూపాయల నగదు బహుమతి**
- **కవిత్వం, నవలలు, కథలు, వ్యాసాలు సహా పలు ప్రక్రియలకు అవార్డులు**
- **తెలుగు సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేసిన రచయితకు మరో ఘనత**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు-2025ను సోమవారం అధికారికంగా ప్రకటించారు. దేశంలోని వివిధ భారతీయ భాషలలో వెలువడిన ఉత్తమ రచనలను ఎంపిక చేసి ఈ పురస్కారాలను ఖరారు చేసినట్లు కేంద్ర సాహిత్య అకాడమీ వెల్లడించింది. మొత్తం 24 భారతీయ భాషలలోని రచయితలకు ఈ ఏడాది అవార్డులు ప్రకటించబడినట్లు అకాడమీ అధికారులు తెలిపారు. సాధారణంగా ప్రతి ఏడాది డిసెంబర్ నెలలో ఈ అవార్డులను ప్రకటించే సంప్రదాయం ఉన్నప్పటికీ, ఈసారి కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రకటన ఆలస్యమైంది. దీంతో 2025 సంవత్సరానికి సంబంధించిన అవార్డులను ఇప్పుడు అధికారికంగా వెల్లడించారు.

కేంద్ర సాహిత్య అకాడమీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఏడాది ఎంపికైన రచనల్లో విభిన్న సాహిత్య ప్రక్రియలకు చెందిన పుస్తకాలు ఉన్నాయి. మొత్తం అవార్డులలో 8 కవితా సంకలనాలు, 4 నవలలు, 6 కథా సంకలనాలు, 2 వ్యాస సంపుటాలు, ఒక సాహిత్య విమర్శ గ్రంథం, ఒక ఆత్మకథ, రెండు జ్ఞాపకాల పుస్తకాలు (మెమోయిర్స్) చోటు దక్కించుకున్నాయి. దేశంలోని వివిధ భాషల్లో సాహిత్య సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని అకాడమీ పేర్కొంది.

ఈ అవార్డులను అందుకున్న రచయితలకు వచ్చే మార్చి 31న న్యూఢిల్లీ నగరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సన్మానం చేయనున్నారు. ఆ కార్యక్రమంలో ప్రతి విజేతకు శాలువా కప్పి సాహిత్య అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారం అయిన తామ్రపత్రాన్ని అందజేస్తారు. అదనంగా ఒక లక్ష రూపాయల నగదు బహుమతిని కూడా అందిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సాహిత్యవేత్తలు, రచయితలు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు అకాడమీ తెలిపింది.

ఈ ఏడాది తెలుగు భాషకు సంబంధించిన సాహిత్య అకాడమీ అవార్డు ప్రముఖ కవి నందిని సిధారెడ్డికి దక్కింది. ఆయన రచించిన 'అనిమేష' అనే కవితా సంపుటికి ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం లభించింది. కరోనా మహమ్మారి సమయంలో సమాజంలో ఏర్పడిన పరిస్థితులు, ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, మానవ సంబంధాలపై పడిన ప్రభావం వంటి అంశాలను కవిత్వ రూపంలో ప్రతిబింబించినందుకు ఈ కవితా సంపుటి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ రచనలో సమకాలీన సమాజం ఎదుర్కొన్న భావోద్వేగాలు, ఆందోళనలు, ఆశలు, నిరాశలను కవి సున్నితంగా చిత్రీకరించినట్లు సాహిత్య విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

నందిని సిధారెడ్డి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందిన కవి. ఆయన రచనలు తెలంగాణ సంస్కృతి, సమాజ జీవితం, గ్రామీణ వాస్తవాలను ప్రతిబింబించేలా ఉంటాయని సాహిత్య వర్గాలు పేర్కొంటాయి. ఈ అవార్డు ద్వారా ఆయన సాహిత్య ప్రయాణానికి మరో గొప్ప గుర్తింపు లభించినట్లు భావిస్తున్నారు. తెలుగు కవిత్వానికి ఆయన చేసిన సేవలకు ఇది గౌరవ సూచకంగా నిలిచిందని పలువురు సాహిత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

నందిని సిధారెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేట ప్రాంతంలో జన్మించారు. ఆయన 1955 జూన్ 12న జన్మించారు. ఆయన తండ్రి నర్రా బాలసిద్ధారెడ్డి స్వాతంత్ర్యోద్యమ కాలంలో రాజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమకారుడు. తల్లి రత్నమాల. చిన్ననాటి నుంచి సాహిత్యం పట్ల ఆసక్తి కలిగిన సిధారెడ్డి తన విద్యాభ్యాసాన్ని సిద్ధిపేటలో పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఉన్నత విద్యను అభ్యసించారు. అక్కడే ఎం.ఏ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు.తరువాత ఆయన ప్రభుత్వ కళాశాలల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. మెదక్ మరియు సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తెలుగు లెక్చరర్‌గా పనిచేశారు. విద్యార్థులకు తెలుగు సాహిత్యం బోధించడంతో పాటు స్వయంగా కూడా సాహిత్య రచనలు కొనసాగించారు. 2012లో ఆయన ప్రభుత్వ సేవ నుంచి పదవీ విరమణ చేశారు. అయితే పదవీ విరమణ తర్వాత కూడా సాహిత్య రంగంలో ఆయన చురుకుగా కొనసాగుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయనకు మరో ముఖ్య బాధ్యత లభించింది. 2017లో తెలంగాణ ప్రభుత్వం ఆయనను తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా నియమించింది. ఆ బాధ్యతను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. తెలంగాణ సాహిత్య సంపదను ప్రోత్సహించడం, కొత్త రచయితలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు.

నందిని సిధారెడ్డి రచనల్లో 'నాగేటి చాల్లల్ల' అనే కవిత ప్రత్యేక ప్రాధాన్యం పొందింది. 1997లో వెలువడిన ఈ కవిత తెలంగాణ సంస్కృతి, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. తరువాత అది పాట రూపంలో కూడా ప్రజల్లోకి వెళ్లి మరింత ఆదరణ పొందింది. ఈ రచన ద్వారా ఆయనకు విశేష గుర్తింపు వచ్చింది.

అదనంగా ఆయన భూమిస్వప్నం, ఇగురం, ఆవర్ధనం, కుల వృత్తులు, ప్రాణహిత వంటి పలు రచనలు చేశారు. ఆయన కవిత్వం సామాజిక స్పృహతో కూడినదిగా ఉండటంతో పాటు తెలంగాణ భాషా శైలిని ప్రతిబింబిస్తుంది. గ్రామీణ జీవితంలోని వాస్తవాలు, సామాజిక సమస్యలు, ప్రజల భావోద్వేగాలు ఆయన కవితల్లో ప్రధానంగా కనిపిస్తాయి.

నందిని సిధారెడ్డి సాహిత్య సేవలకు గతంలో కూడా అనేక అవార్డులు లభించాయి. 2010లో 'నాగేటి చాల్లల్ల' పాటకు ఉత్తమ గేయరచయితగా నంది అవార్డు అందుకున్నారు. 2001లో ఆయన రచించిన 'ప్రాణహిత' కవితా సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది. 1988లో ఆయనకు దాశరథి పురస్కారం కూడా లభించింది. ఇప్పుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం ఆయన



సాహిత్య ప్రయాణంలో మరో ముఖ్య ఘట్టంగా నిలిచింది.

ఇక ఇతర భారతీయ భాషల్లో కూడా ప్రముఖ రచయితలు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అసోమీ భాషలో దేవబ్రత్ దాస్ రచించిన 'కర్ఠి ఖేలార్ సాధు' నవలకు అవార్డు లభించింది. బెంగాలీ భాషలో ప్రసూన్ బందోపాధ్యాయ రాసిన 'శ్రేష్ఠ కబిత' కవితా సంకలనానికి గుర్తింపు దక్కింది. బోడో భాషలో సహైసులి బ్రహ్మ రచించిన నవలకు అవార్డు ప్రకటించారు. డోగ్రీ భాషలో ఖజూర్ సింగ్ ఠాకూర్ కవితా రచనకు ఈ గౌరవం లభించింది.

ఇంగ్లీష్ భాషలో నవతేజ్ సర్నా రాసిన 'క్రిమ్సన్ స్ప్రింగ్' నవలకు అవార్డు లభించింది. గుజరాతీ భాషలో యోగేష్ వైద్య కవిత్వానికి గుర్తింపు దక్కింది. హిందీ భాషలో మమతా కాలియా రాసిన జ్ఞాపకాల గ్రంథం ఎంపికైంది. కన్నడ భాషలో అమరేష్ నుగడోని కథా సంకలనానికి అవార్డు లభించింది.

మలయాళం భాషలో ఎన్. ప్రభాకరన్ రచించిన 'మాయామానుష్యార్' నవల ఎంపిక కాగా, మరాఠీ భాషలో రాజు బావిస్కర్ రాసిన ఆత్మకథకు ఈ గౌరవం దక్కింది. తమిళ భాషలో సా. తమిళ్ సెల్వన్ రాసిన సాహిత్య విమర్శ గ్రంథం ఎంపికైంది. అలాగే ఉర్దూ భాషలో ప్రిత్పాల్ సింగ్ బేతాబ్ కవితా సంకలనానికి అవార్డు ప్రకటించారు.

ఇలా దేశంలోని విభిన్న భాషలలో సాహిత్య సృజనాత్మకతకు కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు ఇవ్వడం ద్వారా భారతీయ సాహిత్య సంపదను ప్రోత్సహించే ప్రయత్నం కొనసాగుతోంది. ప్రతి ఏడాది ఈ అవార్డుల కోసం దేశవ్యాప్తంగా రచయితలు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ

# సైబర్ నేరగాళ్లు








**ఆదిలాబాద్ జిల్లా డిడి 9 వార్త న్యూస్ బ్యూరో**

మనిషి ఆశాజీవి ఆశే మనిషిని ముందుకు నడిపిస్తుంది కానీ కొందరు దురాశతో అడ్డదారులు తొక్కుతున్నారు ఆధునిక సాంకేతికథలను ఉపయోగించి డిజిటల్ మోసాలకు పాల్పడుతున్నారు బ్యాంకు ఖాతాలనుంచి డబ్బులు కొల్లగొడుతున్నారు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తే ఇటువంటి మోసాలు బారిన పడే ముప్పు తప్పుతోంది అంటున్నారు పోలీసులు దేశంలో 20వ శతాబ్దం చివరి దశలో బ్యాంకుల కంప్యూటీకరణ ప్రారంభమైంది ఆ క్రమంలో ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి రావడంతో బ్యాంకు రంగం పూర్తిగా సాంకేతిక ఆధారిత సేవగా మారిపోయింది ఇక స్మార్ట్ ఫోన్లు పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలోనూ విరివిగా అందుబాటులోకి వచ్చాయి దీంతో చాలామంది ఆన్లైన్లోనే చెల్లింపులు జరపడం నగదు బదిలీలు చేసుకోవడం జరుగుతుంది ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు ప్రజల బ్యాంకు ఖాతాల్లో దాచుకున్న సొమ్మును ఆన్లైన్లోనే దోచేస్తున్నారు. బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును దో చేయడానికి సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతులను ఉపయోగిస్తున్నారు రకరకాల ఆఫర్ల పేరుతో ప్రజల మొబైల్ ఫోన్లో ఈ మెయిల్ వంటి వాటికి లింకులు పంపుతారు వాటిని క్లిక్ చేయడం ద్వారా స్మార్ట్ ఫోన్లు కంప్యూటర్లలోకి మాల్వేర్ ప్రవేశిస్తుంది అది మన వ్యక్తిగత సమాచారమంతటిని మోసగాళ్లకు చేరవేస్తుంది మరికొందరు నేరుగా ఫోన్ కు కాల్ చేస్తారు లాటరీ వచ్చిందని ఇంటి నుంచే పని చేసి డబ్బులు సంపాదించవచ్చని ఉద్యోగం ఇస్తామని రకరకాల ఆఫర్లతో ఊరిస్తారు వాటికి స్పందించిన వారిని మాటలతో నమ్మించి యూజర్ ఐడి పాస్వర్డ్ పిన్ వంటి అత్యంత గోప్యంగా ఉండాల్సిన వివరాలను తెలుసుకుంటారు ఇలా తెలుసుకొని వాటిని ఉపయోగించి బ్యాంకు ఖాతాలోని డబ్బులు మాయం చేస్తారు , బ్యాంకు మేనేజర్ల అంటూ కాల్స్ చేసి మన మన వ్యక్తిగత మన వ్యక్తిగత పిన్ నెంబర్ ,ఓటీపీ లను పంపించి మాయ మాటలు చెప్పి డబ్బులను ఖాతా నుండి దోచుకుంటారు సైబర్ నేరగాళ్లు ఇంకో కొత్త రకమైన మోసాలకు పాల్పడుతున్నారు కొరియర్ సర్వీస్ నుంచి మాట్లాడుతున్నాం మీ పేరుతో తైవాన్ కు ఒక పార్సిల్ వెళుతుంది అందులో కొన్ని పాస్పోర్టులు మత్తుమందులు ఉన్నాయని తేలింది మేము క్రైమ్ బ్రాంచ్ పోలీసులం మాట్లాడుతున్నాం ఈ కేసు దర్యాప్తు చేస్తోంది మేమే అని ఫోన్ చేస్తారు ఇంకొందరు ఇంకొంతమంది నీ ఆధార్ కార్డు ఇతర వివరాలు ఉన్న పార్సెల్ చైనా నుంచి వచ్చింది అందులో కొకైన్ , మత్తు మందులు ఉన్నాయి అని భయపెట్టిస్తాడు దీంతో కేసు నుంచి తప్పిస్తామని మాయ మాటలు చెప్పి బెదిరించి పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటారు నేరగాళ్లు సిబిఐ, ఈడి కస్టమ్స్ అధికారులమంటూ పేర్లు చెప్పి సామాన్యులను అడలెస్తిస్తున్నారు ఒకప్పుడు లాటరీ వచ్చిందను మరేదో ఆశ పెట్టి దోచుకునే సైబర్ నేరగాళ్లు ఇప్పుడు భయపెట్టి లూటీ చేయడం మొదలుపెట్టారు ఎదుటివారు ఆలోచించేందుకు సమయం కూడా ఇవ్వకుండా చాకచక్యంగా బోల్తా కొట్టిస్తూ డబ్బులు లూటీ చేస్తున్నారు ఇలాంటి కేసుల నుంచి బయట పడాలంటే వాటిని అసలు నమ్మొద్దు మీ వ్యక్తిగత వివరాలు చెప్పగానే నిజమని భావించవద్దు సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతులు చాలామంది వ్యక్తిగత వివరాలు సేకరించి పెట్టుకొని ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారు కొరియర్ వంటి వాటి గురించి చెబితే వెంటనే బెదిరిపోవద్దు ఒకవేళ ఇలాంటి కాల్స్ వస్తే స్థానిక పోలీసులకు సంప్రదించండి అని పోలీసు శాఖ సూచిస్తుంది . సో బి కేర్ ఫుల్.

**- మడి గణేష్ సీనియర్ జర్నలిస్ట్ ఆదిలాబాద్.**





## హజ్ యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు..

# ముందస్తు టీకాలు

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**




నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 340 మంది హజ్ యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ముందస్తు టీకాలు వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ తెలిపారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న యాత్రికులకు ఈ నెల 13 నుంచి 17 వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వివిధ పరీక్షలు నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా ఎత్తు, బరువు, రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలతో పాటు ఇతర సాధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో శారీరకంగా, మానసిక దృఢంగా ఉన్నవారిని గుర్తించి, వారికి ఈ నెల 23న ఇన్ఫ్లుఎంజా, మెనింజైటిస్ టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. 60 ఏళ్లు పైబడిన 56 మంది యాత్రికులకు ఇన్ఫ్లుఎంజా టీకాలు, మొత్తం 340 మంది యాత్రికులకు మెనింజైటిస్ టీకాలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ అశోక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## పోలీస్ స్టేషన్లలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సోమవారం భారీ ఎత్తున పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశానుసారం నిజామాబాద్, ఆర్మూర్, మరియు బోధన్ డివిజన్లలోని అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, ఏసీపీ కార్యాలయాల్లో ఈ పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది తమ కార్యాలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.



## పిప్పరిలోపశువులకు ఉచిత గాలికుంటూ టీకాలు.

**బజార్హత్నూర్,మార్చి,15(డిడి9వార్త ):-**

బజార్ హత్నూర్ మండలంలోని పిప్పరి గ్రామంలో బజార్ హత్నూర్ పశువైద్యాధికారులు సోమవారం రోజు ఉదయం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు, మేకలు,గొర్రెలకు,గాలి కుంటూ వ్యాది సోకకుండా నివారణ టీకాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి పర్వేజ్ అహ్మద్,సిబ్బంది,గోపాల మిత్ర కార్యకర్తలు జాడే దుర్గాజీ, జగన్,ఠాకూర్ సూరజ్ సింగ్,పశువులకాపరులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.






## కలెక్టరేట్ వద్ద ప్రైవేట్ కళాశాలల సిబ్బంది ఆందోళన

- **ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సిబ్బంది సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా పాలన కార్యక్రమానికి తరలివచ్చిన సిబ్బంది, తమ గోడును వివరిస్తూ కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ముఖద్వారం వద్ద సిబ్బంది పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం నుండి రావాల్సిన స్కాలర్షిప్, రీయింబర్స్మెంట్ నిధులు నిలిచిపోవడంతో యాజమాన్యాలు గత ఆరు నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పూట గడవడం కూడా కష్టంగా మారిందని అధ్యాపక, బోధనేతర సిబ్బంది వాపోయారు. రంజాన్ పండుగ ముంచుకొస్తున్న తరుణంలో ముస్లిం మైనార్టీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేస్తేనే తమకు జీతాలు అందుతాయని, లేనిపక్షంలో ఈ పండుగ నాడు కూడా పస్తులు ఉండాల్సి వస్తుందని వారు ఆవేదన చెందారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరాల సుధాకర్, దేవారెడ్డి, అనురాధ, కౌసర్ బేగం, సందేశ్, సందీప్, చందన్ సింగ్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన చదువు




- **ఓడ్డాట్ పల్లిలో మన ఊరు - మన బడి ప్రచారం**

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**

మాక్లూర్ మండలం ఓడ్డాట్ పల్లి గ్రామంలో సోమవారం మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బడుగు సత్యనారాయణ, ఉప సర్పంచ్ నిమ్మల అరుణ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు యువజన సంఘం సభ్యులు కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బడుగు సత్యనారాయణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం అధికంగా ఉందని, దానికి భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు క్రమశిక్షణతో మెరుగైన ఫలితాలు సాధించి, భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**

కమ్మర్ పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బైకన్ జమున మహేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ వసంత్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని 32 గోజాతి పశువులకు, 150 గేదెలకు ఉచితంగా టీకాలు వేసినట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశువులకు తప్పనిసరిగా టీకా వేయించాలని ఆయన సూచించారు. వ్యాధి సోకిన పశువులలో నోటిలో పుండ్లు పడి చొంగ కారడం, కాలి డెక్కలలో పగుళ్లు ఏర్పడి నడవలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. దీనివల్ల పాల ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా, చూడి పశువులకు గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
రైతులు తమ పశువుల రక్షణ కోసం ముందు జాగ్రత్తగా ఈ ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిలువేరి భూమేశ్వర్, పశువైద్య సిబ్బంది సత్యం, స్మరణ్, గోపాలమిత్ర, స్థానిక రైతులు పాల్గొన్నారు.






## సీనియర్ సిటిజన్స్ ఫోరం నూతన కార్యవర్గ ఎన్నిక

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరం లోని సుభాష్ నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం త్రైవార్షిక ఎన్నికలు (202629) ఆదివారం రాత్రి ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో ఫోరం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా కె. నారాయణ రెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ వి. విజయకుమార్, కోశాధికారిగా సంగెమ భూమయ్య, సహ అధ్యక్షులుగా రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులుగా బి.లింగయ్య, సంయుక్త కార్యదర్శిగా ధర్మరాజు మరియు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గుజరాతీ రాజేశ్వరిలతో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారులు ఆశన్న, మేఘ రాజ్, గంగా కిషన్ మరియు కైర గంగాధర్‌లు పర్యవేక్షించి, ఎన్నికైన ప్రతినిధులను అధికారికంగా ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలియజేశారు.

## నిరుద్యోగ ఎస్సీ యువతకు స్వయం ఉపాధి పథకాలు

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**

జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు 202526 వార్షిక ప్రణాళిక కింద స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో కోరారు. రవాణా రంగం కింద ఈవీ టూవీలర్లు, త్రీవీలర్లు మరియు వ్యవసాయ పథకాల కింద సోలార్ పంప్ సెట్ల కోసం ఈ నెల 17 నుండి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. జూలై 1, 2025 నాటికి వయోపరిమితి వ్యవసాయేతర పథకాలకు 2150 ఏళ్లు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 2160 ఏళ్లు, మరియు శిక్షణకు 1845 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించరాదని, ఒక రేషన్ కార్డుపై ఒకరు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో లబ్ధి పొందిన వారు అనర్హులని, ఆసక్తి గల వారు https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, ఆ ఫారమ్‌ను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలోని రూమ్ నెం.102లో సమర్పించాలని సూచించారు. ఈవీ వాహనాల కోసం గిగ్ కార్మికులకు (జొమాటో, స్విగ్గీ తదితర) ప్రాధాన్యత ఉంటుందని, సోలార్ పంపుల కోసం కనీసం రెండెకరాల భూమి ఉండాలని ఆమె వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 16మార్చి(డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండలం పోచారం గ్రామ సమీపంలోని బషీర్ ఫారం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జమలం గ్రామానికి చెందిన గంగామణి, లక్ష్మణ్ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వ్యవసాయ కూలీ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై నిజామాబాద్‌కు వెళ్తుండగా గుర్తుతెలియని కారు వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలవ్వగా, సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితులను నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## జిల్లా వ్యాప్తంగా బహిరంగ మద్యం సేవనం పై ప్రత్యేక ధ్రుష్టి.

- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, మార్చి,16 ( డిడి9వార్త ) :-**



జిల్లాలో ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా రోడ్ల పక్కన, పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవించడం (బహిరంగ మద్యం సేవనం ) పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ చర్యల్లో భాగంగా ప్రతిరోజు జిల్లాలో 20 ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేసి ముఖ్య రహదారులు,ప్రయాణ ప్రాంగణంలు, పార్కులు, మార్కెట్ ప్రాంతాలు, ఇతర పబ్లిక్ ప్రదేశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే వ్యక్తులపై ఇకనుండి నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పబ్లిక్ న్యూసెన్స్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజా ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల రోడ్డు ప్రమాదాలు, గొడవలు, ఇతర నేరాలు జరిగే అవకాశాలుఎక్కువగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల జనం చట్టాలను గౌరవిస్తూ పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవించడం మానుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా బహిరంగంగా మద్యం సేవనం జరుగుతున్నట్లు గమనిస్తే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

# వృత్తిదారుల నిధులు వెంటనే విడుదల చేయాలి

- **మార్చి నెలాఖరు లోపు విడుదల చేయకుంటే నిధులు లాప్స్ అయ్యే ప్రమాదం**
- **చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆందోళన**

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**




రాష్ట్ర బడ్జెట్‌లో కులవృత్తుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలని, క్షేత్రస్థాయిలో అల్లాడుతున్న వృత్తిదారులను ఆదుకోవాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ గళమెత్తింది. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి. రమణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల మురళి పాల్గొని మాట్లాడారు. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ కులవృత్తుల కార్పొరేషన్లు, ఫెడరేషన్ల బలోపేతానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 1,018 కోట్లు కేటాయించినప్పటికీ, నేటికీ ఆ నిధులు కాగితాలకే పరిమితం కావడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కేవలం కొద్దిరోజులే సమయం ఉన్నందున, మార్చి నెలాఖరు లోపు ఈ నిధులను విడుదల చేయకపోతే అవి నిరుపయోగంగా (లాప్స్) మారిపోయే ప్రమాదం ఉందని, తద్వారా నిధులు తిరిగి ఖజానాకు చేరుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేటాయింపులు భారీగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం వాటిని కుదించడమే కాకుండా.. కేటాయించిన అరకొర నిధులను కూడా ఖర్చు చేయకపోవడాన్ని వారు తప్పుబట్టారు. ఇటీవల తాము వివిధ కార్పొరేషన్ల కార్యాలయాలను సందర్శించి అధికారులతో చర్చించగా, ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు, ఆదేశాలు లేకపోవడం వల్లే నిధుల వ్యయం జరగడం లేదని తేలిందన్నారు. దీనివల్ల సంక్షేమ పథకాలు పూర్తిగా స్తంభించిపోయాయని, కార్పొరేషన్లు కేవలం నామమాత్రపు ఉత్సవ విగ్రహాలుగా మారాయని మండిపడ్డారు. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాల ప్రయోజనాలను కాపాడాలని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి వృత్తిదారుల అభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.ఆశయ్య, గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, కల్లుగీత కార్మిక సంఘం నేత బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నరసింహ, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం నేత రాళ్లబండి కుమారస్వామి, బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం నుంచి జి.నాగరాజు, క్షౌర వృత్తిదారుల సంఘం నేత చెన్నారం మల్లేశం, వడ్డెర సంఘం నేత పల్లపు విగ్నేష్ తదితర నేతలు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



## గ్రామాల్లో వంద శాతం పన్ను వసూళ్లే లక్ష్యం : ఎంపీడీవో శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా 16మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర మండలంలోని గ్రామ పంచాయతీలో వంద శాతం ఇంటి పన్ను వసూళ్లే లక్ష్యంగా ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం హున్స గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శ్రీనివాస్, సర్పంచ్ శివకుమార్ లు మాట్లాడుతూ... ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉన్న నేపథ్యంలో నెలాఖరులోగా వంద శాతం పన్నులను వసూలు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామంలో చేపట్టే మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటు మరియు మంచినీటి సరఫరా వంటి నిత్యవసర పనులన్నీ ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే సాధ్యమవుతాయని వారు వివరించారు. ప్రజలు బాధ్యతగా పన్నులు చెల్లించి గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలని ఆయన కోరారు. పన్ను వసూలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ప్రతి రూపాయికి రశీదు అందిస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను సైతం తక్షణమే చెల్లించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు ఉచిత విద్యుత్ వెలుగులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 16మార్చి(డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండల కేంద్రంలోని అంగడి బజార్ అంగన్వాడీ కేంద్రంలో విద్యుత్ మీటర్ బిగించి విద్యుత్ సరఫరాను ప్రారంభించడం ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. బోధన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సౌకర్యం లేని మొత్తం 129 అంగన్వాడీ కేంద్రాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు నిజామాబాద్ కన్స్ట్రక్షన్ ఏడీఈ తోట రాజశేఖర్ తెలిపారు. చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించి, ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ప్రభుత్వ సొంత భవనాలతో పాటు కిరాయి భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు కూడా ఈ ఉచిత విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి ఆపరేషన్ ఏడీఈ పిల్లమర్రి ప్రభాకర్, కన్స్ట్రక్షన్ ఏఈ ఆర్. సుమిత, ఆపరేషన్ ఏఈ కిషోర్ రెడ్డి, అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి మరియు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.



# సామాజిక ఐక్యతకు నిదర్శనం ఇఫ్తార్ విందు

- **కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 16మార్చి(డీడీ9 వార్త) :**

మతాలకతీతంగా సామాజిక సామరస్యాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎడపల్లి మండలంలోని నెహ్రూ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ప్రసంగించారు. రంజాన్ మాసం పవిత్రతను, దానగుణాన్ని, సోదరభావాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని, ఇటువంటి వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు. రాజ్యాంగబద్ధమైన లౌకిక విలువలను కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, మైనారిటీల సంక్షేమానికి తమ పార్టీ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని పులి శ్రీనివాస్ ఉద్ఘాటించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ముస్లిం మత పెద్దలు, పార్టీ కార్యకర్తలు, నెహ్రూ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.



# మందుల పంపిణీలో పారదర్శకతకు పెద్దపీట

- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రాజశ్రీ**

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**





ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల నిల్వలు, పంపిణీ ప్రక్రియలో పూర్తిస్థాయి జవాబుదారీతనం, పారదర్శకతను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రాజశ్రీ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఫార్మసీ అధికారులకు నిర్వహించిన డ్రగ్ అండ్ వ్యాక్సిన్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో వేర్వేరుగా ఉన్న ఈఔషధి మరియు ఫ్యామిలీ ప్లానింగ్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ సిస్టమ్ లను ఇప్పుడు ఏకీకృతం చేస్తూ సరికొత్త డీ.వి.డీ.ఎం.ఎస్ పోర్టల్‌ను రూపొందించారని, ఇకపై మందుల స్వీకరణ, పంపిణీ, నిల్వలు మరియు గర్భనిరోధక సాధనాల రిపోర్టింగ్ అంతా ఈ ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఫార్మసీ అధికారులు కచ్చితంగా సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మెడిసిన్స్ లిస్టును ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. స్టాక్ మరియు డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడంతో పాటు, గడువు ముగిసిన మందులను వెంటనే గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించాలని, ప్రతిరోజూ జరిగిన డేటా ఎంట్రీని అదే రోజు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఐఎల్ఆర్, డీఫ్రీజర్లలో వ్యాక్సిన్ల భద్రత కోసం ఉష్ణోగ్రతను నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర కిట్లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ఆశా కార్యకర్తలు ప్రతి గృహాన్ని సందర్శించి బాధితులను గుర్తించి తక్షణమే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది మధ్య సమన్వయం ఉంటేనే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆమె పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్వేత, జిల్లా ఎపిడమాలజిస్ట్ డాక్టర్ శ్రావ్య, ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ, డీడీఎంలు పృథ్వి, నారాయణ, హెచ్‌ఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ మరియు వివిధ పీహెచ్‌సీల నుండి విచ్చేసిన ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీలో భారీ స్థాయిలో చేరి కలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

- **బజార్ హత్నూర్ నుంచి 100 మందికి పైగా చేరికలు...**

**బజార్ హత్నూర్ మార్చి 16(డిడి9వార్త ):-**





బజార్‌హత్నూర్,బోథ్,సొనాల మండలాల నుంచి వివిధ పార్టీ లకుచెందిననాయకులు,కార్యకర్తలు పెద్దసంఖ్యలోకాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణా రావు సమక్షంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాకప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి , పీసీసీ చైర్మన్ మహేష్ కూమర్ గౌడ్,ఆదిలాబాద్ డీసీసీ చైర్మన్ నరేష్ జాదవ్ , బోథ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ , తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, అదే కారణంగా ఇతర పార్టీలకు చెందిన నాయకులు కూడా కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని నాయకులు పేర్కొన్నారు.బజార్‌హత్నూర్ మండలం నుంచి సుమారు వందమందికి పైగా నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరగా, బోథ్, సోనాల మండలాల నుంచి కూడా వివిధ పార్టీలకు చెందినపలువురు నాయకులు,కార్యకర్తలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో చిలుకూరి భూమన్న, నాగోరావ్, దీసి విజయేందర్, చహకటి మహేష్, తాండ్ర వెంకట రమణ, పడిపెల్లి శ్రీనివాస్, కొత్త రమేష్, పిప్పిరి సర్పంచ్ కృష్ణ కుమార్ రెడ్డి తదితర నాయకులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన అనేక మంది కార్యకర్తలు ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రభావంతో గ్రామస్థాయి వరకు పార్టీ బలోపేతం అవుతోందని నాయకులు తెలిపారు. వచ్చే రోజుల్లో మరింత మంది ప్రజా ప్రతినిధులు, యువ నాయకులు కాంగ్రెస్ పార్టీలోచేరేఅవకాశముందని వారుపేర్కొన్నారు. ఈ భారీ చేరికలతో బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ఇతర పార్టీలకు ఇది గట్టి రాజకీయ సంకేతమని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.



## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**

ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఇన్చార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లతో కలిసి కలెక్టర్ బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 80 వినతులు అందగా, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయవద్దని సూచించారు.

సమయపాలనపై సీరియస్: ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు ఆలస్యంగా హాజరు కావడాన్ని కలెక్టర్ గమనించారు. ప్రతి ఒక్కరూ విధిగా సమయపాలన పాటించాలని ఉదయం 10:30 గంటలకే నిర్ణీత సమయానికి అందరూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.




# ఏప్రిల్ 1 నాటికి ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఈ ఆఫీసులుగా మారాలి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

- **ఏప్రిల్ 1 నాటికి ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఈ-ఆఫీసులుగా మారాలి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా, 16 మార్చి (డీడీ9 వార్త) :**

మండల ప్రత్యేక అధికారులు అందరూ తప్పనిసరిగా క్షేత్రస్థాయి సందర్శనలు జరపాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె, రానున్న రెండు మూడు వారాలు ఎంతో కీలకమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. ముఖ్యంగా బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించినప్పుడు విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత, సామాజిక సమస్యలు మరియు మానసిక ఒత్తిడి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా వివరాలు సేకరించి వారికి అవసరమైన మద్దతును అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు వచ్చే ఏప్రిల్ 01 నాటికి పూర్తిస్థాయిలో ఈఆఫీసులుగా మారాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిపాలనాపరమైన అనుమతులు, ఆర్థిక లావాదేవీలు అన్నీ ఇకపై ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని, ఈ ప్రక్రియలో ఎటువంటి జాప్యం ఉండకూడదని పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానంపై అవసరమైతే ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని ఈడిస్ట్రిక్ట్ మేనేజర్‌కు సూచిస్తూ, ఈ ఈఆఫీసు ప్రక్రియకు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఏప్రిల్ 02వ తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను విధిగా నిర్వహించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఈ సభలను ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని, ప్రజల కోసం తాగునీరు, షామియానా వంటి కనీస వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంట రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, పెన్షన్ల మంజూరు మరియు మహాలక్ష్మి పథకం వంటి వివరాలను ఆయా సభలలో ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. మరోవైపు వలస కార్మికుల సంక్షేమంపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... కార్మికులకు చట్టపరమైన హక్కులు, ప్రయోజనాలు వర్తించేలా సంబంధిత శాఖలు కృషి చేయాలని ఆదేశించారు. ఇటుక బట్టీలు, రైస్ మిల్లుల్లో పనిచేసే వారికి కనీస వేతనాలు, వసతులు అందేలా పర్యవేక్షించాలని, బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గల్ఫ్ వలస కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉన్నందున, వారి వివరాల సేకరణ మరియు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. స్పెషల్ రివిజన్ ఇంటెన్సివ్ ప్రక్రియలో భాగంగా వచ్చే సోమవారం నాటికి 70 శాతం మ్యాపింగ్ పూర్తి కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.







## గంజాయి పై ఉక్కు పాదం

- **74 గంజాయి మొక్కలు స్వాధీనం.**
- **ఇద్దరు నిందితులు అరెస్టు, రిమాండ్.**
- **బోథ్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**
- **బోథ్ సిఐ డి గురుస్వామి**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 16(డి డి 9):-**




విశ్వసనీయ సమాచారం మేరకు జొన్న పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న 74 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు బోథ్ సి.ఐ డి. గురుస్వామి. తెలిపారు. నిందితుల వివరాలు 1) కాంబ్లే ముకుందరావు (63) s/o కందు, చింతల్ బోరి గ్రామం, బోథ్ మండలం . 2) కనక మారుతి (28) s/o భూమన్న, ధర్మపురి గ్రామం, బజారత్నూర్ మండలం. సోనాల మండలం కేంద్రం నందు నిందితుడు కనక మారుతి రెండు మొక్కలతో ఉండగా బోత్ పోలీస్ సిబ్బంది పట్టుకుని విచారించడం జరిగిందని, విచారణలో కాంబ్లె ముకుందరావు, వద్ద కొనుగోలు చేసినట్టు తెలిపాడం జరిగింది. ఈ సమాచారంతో ఆదివారం బోత్ మండలం చింతల్ బోరి గ్రామం నందు గల నిందితుడు కాంబ్లే ముకుందరావు 1.2 ఎకరాలలో ఉన్న పంట చేన్లో తనిఖీ చేయగా జొన్న పంటనందు అంతర పండగ గంజాయిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. గంజాయి సాగు, సేవించడం, రవాణా చేయడం, వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరమని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు చేసిన వారికి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులకు గంజాయి పై ఎలాంటి సమాచారం ఉన్న తెలియజేయాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు.గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వ్యసనాల బారిన పడకుండా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోత్ ఎస్సై వి .పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.



## పోతంగల్ ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్



**నిజామాబాద్ పోతంగ ల్ మార్చి 16:(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని పోతంగల్ గ్రామంలో సోమవారం రోజున ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్స్ ఎమ్మార్వో రంజిత్ వారు మాట్లాడుతూ ఈ రోజు పై అధికారుల ఆదేశానుసారము పీఎస్సీ ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది ఇక్కడ 6 బెడ్ హాస్పిటల్ బాగా ఉంది మెయింటెనెన్స్ బాగుంది పేషెంట్స్ ఈరోజు 75 మంది వచ్చారు వారికి సరైన ట్రీట్మెంట్ చేసి పంపించారు. ఇద్దరు పేషెంట్ ఇన్ పేషెంట్ లాగా ఉన్నారు వారికి గ్లూకోస్ ఎక్కించారు జ్వరంతో ఉంది ఇక్కడ మెడికల్ ఆయుర్వేదిక్ కూడా ఉంది కొన్ని వాళ్ళ చిన్న చిన్న రిక్రూట్మెంట్ ఉన్నవి అడిషనల్ రూమ్ ఒకటి వాచ్మెన్ కావాలి అని చెప్పడం జరిగింది ఇదే నివేదిక మేము కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తాము మేము ఈరోజు వచ్చి చూసిన దానికి చాలా సంతోషిస్తున్నాము.సర్పంచ్, కల్లూరి సంధ్య, హన్మాండ్లు,తహసిల్దార్, రంజిత్,ఎంపీడీవో చందర్, ఆర్ ఐ సయ్యద్ హుస్సేన్, సర్వేయర్, పోశెట్టి,డాక్టర్లు అలీముద్దీన్,జయప్రకాష్,కరణ్, హెల్త్ సూపర్వైజర్లు సుజాత, సావిత్రి, పంచాయతీ సెక్రెటరీ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## సికింద్రాబాద్ సర్కిల్‌లో గ్యాస్ దాడులు

- **18 ఎల్పీజీ సిలిండర్లు స్వాధీనం**

**సికింద్రాబాద్,మార్చి 16 ( డి డి 9) :**




సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో గృహ వినియోగానికి ఉద్దేశించిన ఎల్పీజీ సిలిండర్లను దుకాణాల్లో అక్రమంగా ఉపయోగిస్తున్న వారిపై అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 18 గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. రెజిమెంటల్ బజార్, తార్నాక, మెట్టుగూడ, వారాసిగూడ ప్రాంతాల్లో ఈ దాడులు నిర్వహించారు. దుకాణాల్లో గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడులను సికింద్రాబాద్ అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్ జి.వి. చాముండేశ్వరి ఆధ్వర్యంలో డీటీలు ఉత్తేజ్ సాగర్, అభిషేక్, శ్రీనివాస్, అరుణతో పాటు ఇన్‌స్పెక్టర్లు నిర్వహించారు. అక్రమంగా గ్యాస్ సిలిండర్లను వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అలాగే గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించవద్దని సూచించారు.

# కరాటేలో సత్తా చాటిన వేదం విద్యార్థులు.

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 16(డి డి 9):-**

స్థానిక వేదం పాఠశాలలో "కెన్‌భూకాయ్‌షీటురియు కరాటే స్కూల్ ఆఫ్ ఇండియా" ఆదిలాబాద్ జిల్లా వారు బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో మన వేదం పాఠశాల విద్యార్థులు జోహ గ్రీన్ బెల్ట్, సంజన, శ్రీనిధి, శ్రీన్విత, మహశ్రీ,మాన్విక,రిశిక్, రిశాల్, మరియు శ్రీ హర్షన్, భద్రీనాథ్ మొదలగు విద్యార్థులు ఆరెంజ్ బెల్టులు హరిణి, శ్రీ వర్ధన్ బ్లూ బెల్టులు మరియు కార్తీక్, మనివర్ధన్,స్నేహాల్,నివిత, హేమచంద్ర, శ్రీనిత్, తరుణ్, ఎల్లో బెల్ట్ లు సాధించారు. గ్రీన్,ఆరెంజ్, బ్లూ, యెల్లో బెల్టులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ గారు మరియు ఉపాధ్యాయులు అభినందించారు.



# అంతర్జాతీయ పోటీలకు అరిష్మ.. ఆర్థికంగా చేయూతనివ్వండి

- టర్కీ వెళ్లడానికి నిధుల కొరత..
- నిజామాబాద్ జిల్లా విద్యార్థిని దీనస్థితి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 16మార్చి(డీడీ9 వార్త) :**

అది నిజామాబాద్ జిల్లాలోని ఒక చిన్న గ్రామం.. ఆ ఇల్లు చాలా సామాన్యమైంది. కానీ ఆ ఇంటి బిడ్డ కన్న కలలు మాత్రం ఆకాశమంత. పట్టుదలే ఊపిరిగా, కష్టాలనే మెట్లుగా మార్చుకుని, చూపు సవాలుగా మారినా గురి తప్పని క్రీడాకారిణిగా ఎదిగింది ఎర్రం అరిష్మ. అంతర్జాతీయ గోల్‌బాల్ పోటీలకు ఎంపికై దేశం తరపున ఆడేందుకు సిద్ధమైన ఈ క్రీడాకారిణి ప్రయాణానికి ఇప్పుడు పేదరికం పెద్ద అడ్డంకిగా మారింది.

చూపు లేకపోయినా.. లక్ష్యం వైపు అడుగులు: సాలూర మండలం హున్సా గ్రామానికి చెందిన ఎర్రం రాజు, కవిత దంపతుల కుమార్తె అరిష్మ. పుట్టుకతోనే దృష్టి లోపం ఉన్నా, ఆమె ఎప్పుడూ కుంగిపోలేదు. చిన్నజీయర్ స్వామి స్థాపించిన నేత్ర కళాశాలలో విద్యనభ్యసిస్తూనే గోల్‌బాల్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబర్చింది. సంప్లిత ఫౌండేషన్ ఇచ్చిన శిక్షణతో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రత్యర్థులను చిత్తు చేసి ఇప్పుడు ఏప్రిల్ 6న టర్కీ దేశంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది.

దాతల చేయూత కోసం ఎదురుచూపులు : టర్కీ వెళ్లడం అంటే కేవలం విమానం ఎక్కడం కాదు.. అది ఒక నిరుపేద తండ్రి కల, ఒక గ్రామీణ విద్యార్థిని పట్టుదల. కానీ ఆ విదేశీ ప్రయాణ ఖర్చులు, అక్కడ ఉండటానికి అయ్యే వ్యయం ఆ కుటుంబానికి భారంగా మారింది. నా బిడ్డ దేశం తరపున ఆడి పతకం తేవాలని ఉంది, కానీ మా ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదు అని ఆమె తల్లిదండ్రులు కళ్ళ నీళ్ళతో వేడుకుంటున్నారు. ఒక సామాన్య రైతు బిడ్డ అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలంటే మనందరి సహకారం అవసరం. దాతలు, ప్రజా ప్రతినిధులు, మరియు స్వచ్ఛంద సంస్థలు మానవత్వంతో స్పందించి అరిష్మను ఆర్థికంగా ఆదుకోవాలని హున్సా గ్రామస్థులు కోరుతున్నారు. చిన్న సహాయం ఒక గొప్ప క్రీడాకారిణి భవిష్యత్తును మార్చగలదు.



# హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా డాక్టర్ కవితారెడ్డి

**నిజామాబాద్ జిల్లా 16మార్చి(డీడీ9 వార్త) :**

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా నిజామాబాద్ నగరానికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కవితారెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె బాధ్యతలు స్వీకరించగా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవితారెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ మరియు ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తానని ఆమె స్పష్టం చేశారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్‌ను అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఆకుల లలిత, ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార యూనియన్ చైర్మన్ మోహన్ రెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ తదితరులు కవితారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ అసోసియేషన్ల నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



# బోథ్ నియోజకవర్గంలో ఎప్సెట్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి.

**బజార్హత్నూర్, మార్చి 16 (డిడి9వార్త ):-ఆదిలాబాద్**

జిల్లాలోని బజార్ హత్నూర్ మండలంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంకు సోమవారం రోజు వచ్చిన ఒక దరఖాస్తులో విద్యార్థులు శిక్షణ కేంద్రం ఏర్పాటు కావాలి అని కోరారు.ఈ దరఖాస్తు ప్రదానంగా ఇంటర్ రెండో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇచ్చారు. అధికారులుఆదిలాబాద్ జిల్లాకు ఒకే ఎప్ సెట్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారని అది కూడా బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో జిల్లాలో మొత్తం 23 మండలంలలోని వివిధ కోర్సెస్ చదువుతున్న వారికి ఇది అసౌకర్యంగా ఉంది. బోథ్ నియోజకవర్గంలోని బజార్ హత్నూర్ మండలంలో లేదా బోథ్లో నైనా మరియొక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి పేద విద్యార్థులయినా ఎస్ టీ, ఎస్ సి, బీసీ విద్యార్థులకు శిక్షణను ఇప్పించాలని కోరారు.కొన్ని వ్యవసాయం కు సంబందించిన దరఖాస్తులు కూడా ఉన్నవని డి టీ తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె శ్రీనివాస్,అగ్రికల్చర్ అధికారి మహమ్మద్ సౌద్, డిప్యూటీ తహసీల్దార్ పవార్ హీరాలాల్, ఎంపీవో మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# గోవుల అక్రమ రవాణాను అరికట్టవలసిందిగా, బోథ్ సబ్ ఇన్స్పెక్టర్ గారికి వినతి

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 16(డి డి 9):-**

బోథ్,సోనాల మండలాల పరిధిలో ఇటీవల గోవులను అక్రమంగా రవాణా చేస్తున్న ఘటనలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది.గోవు హిందూ సమాజంలో పవిత్రమైనది కావడంతో ,ఇటువంటి చర్యలు ప్రజల మత భావాలను దెబ్బ తీయడమే కాకుండా చట్టవిరుద్ధమైనవి కూడా. అందువల్ల మా మండల పరిధిలో గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మీరు ప్రత్యేక దృష్టి సారించి, రాత్రి పూట చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహించి, అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. మీరు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకొని మా ప్రాంతంలో ఇటువంటి అక్రమ కార్యకలాపాలు నిలిచిపోయేలా చూడగలరని ఆశిస్తున్నాము.




# స్వయంభు మహాదేవాలయంలో మహా అన్నదాన కార్యక్రమం.



**నిజామాబాద్ పోతంగల్ మార్చి 16:(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని కారేగాం గ్రామంలో స్వయంభు మహా దేవాలయం లో సోమవారం నాడు గ్రామ సర్పంచ్ నరహరి సునీల్ శివుడికి ప్రత్యేక పూజ అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం భక్తుల కొరకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన దాతగా ముందుకు వచ్చి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక పూజారితో పాటు అధికారులకు ప్రజా ప్రతినిధులకు సర్పంచ్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు బాకర్ ఫారం సర్పంచ్ కనక మేడల శ్రీనివాసరావు కారేగాం సర్పంచ్ నరహరి సునీల్ చేతన్ నగర్ సర్పంచ్ కాంత సునీల్ హెగ్డోలి సర్పంచ్ నాగరాజు ఉప సర్పంచులు సతీష్ రాంబాబు ఆలయ కమిటీ చైర్మన్ నాగ్ నాథ్ పటేల్,ఈర్వంత్ రావు పటేల్ అధికారులు తహసిల్దార్ రంజిత్ కుమార్ ఎంఈఓ లోలా శంకర్ స్థానిక నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# పోతంగల్ హనుమాన్ ఆలయానికి రూ.5,16,000 విరాళం అందజేసిన ముమ్మలనేని రాజశేఖర్



**నిజామాబాద్, పోతంగల్, మార్చి 16 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన దాత, విశాల మనసున్న వ్యక్తి ముమ్మలనేని రాజశేఖర్ పోతంగల్ గ్రామంలోని హనుమాన్ ఆలయ అభివృద్ధికి ఉదారంగా విరాళం అందజేశారు. సోమవారం పోతంగల్ గ్రామంలో ఏప్రిల్ 2న జరగనున్న హనుమాన్ మందిర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానం ఇవ్వడానికి వెళ్లిన గ్రామ పెద్దలను ఆయన సాదరంగా ఆహ్వానించి ఆలయ అభివృద్ధి కోసం తన వంతుగా రూ.5,16,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ మందిరం కమిటీ సభ్యులు ముమ్మలనేని రాజశేఖర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చేసిన సహాయం ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.




## ఇంకో రెండ్రోజులే స్కూళ్లు నడిచేది..
# వరుసగా నాల్రోజులు సెలవులే

- ఈ వీకెండ్ తెలుగు విద్యార్థులు, ఉద్యోగులకు వరుస సెలవులు వస్తున్నాయి. ఉగాది, రంజాన్ పండగల సెలవులు ఆదివారంతో కలిసి వస్తున్నాయి.
- దీంతో వరుసగా నాల్రోజులు హాలిడేసే.



**బజార్హత్నూర్, మార్చి 16(డిడి9వార్త ):-**

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పరీక్షల సీజన్ కొనసాగుతోంది... ఇప్పటికే ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ ముగిశాయి, పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇక ఇతర క్లాసుల విద్యార్థులకు కూడా త్వరలోనే వార్షిక పరీక్షలు జరగనున్నాయి... దీంతో ప్రతి విద్యార్థిపై చదువుల ఒత్తిడి పెరిగింది. ఇలాంటి సమయంలో వరుస సెలవులు వస్తే..? విద్యార్థులకు కాస్త ఊరట లభిస్తుంది... చదువు నుండి కాస్త దృష్టిమరల్చి రిలాక్స్ కావడానికి సమయం దొరుకుతుంది. ఇలా ఈవారం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు వరుస సెలవులు వస్తున్నాయి. తెలుగు సంవత్సరాది ఉగాదిని ఇరు రాష్ట్రాల ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. దేవాలయాల్లో నూతన పంచాంగ శ్రవణం ఉంటుంది... ప్రజలు కూడా ఇళ్లలో భక్తి శ్రద్దలతో పూజలు చేసుకుంటారు. తీపి, చేదు, పులుపు ఇలా అన్నిరకాల రుచులతో కూడిన ఉగాది పచ్చడి చాలా ప్రత్యేకం. ఈ పండగ నేపథ్యంలో మార్చి 19 అంటే వచ్చే గురువారం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లోని విద్యాసంస్థలకు సెలవు ఉంది. ముస్లింలు గత నెలరోజులుగా ఉపవాస దీక్ష చేపడుతూ రంజాన్ పండగ కోసం ఎదురుచూస్తున్నారు. ఆ పండగ రానే వచ్చింది... మార్చి 20 లేదా 21 తేదీన అంటే ఈ శుక్రవారం లేదా శనివారం రంజాన్ జరగనుంది. ఈ పండక్కి కూడా ఇరు తెలుగు రాష్ట్రాల్లో అధికారికంగా విద్యాసంస్థలకు సెలవు ఇచ్చారు. రంజాన్ పండగ నెలవంక దర్శనంపై ఆధారపడి ఉంటుంది. అందుకే పండగ ఈ శుక్రవారమా లేక శనివారమా అన్నది క్లారిటీ లేదు. ఏపీలో మార్చి 20న, తెలంగాణలో మార్చి 21న రంజాన్ సెలవుగా ప్రకటించారు. అయితే ఇస్లామిక్ పెద్దల ప్రకటన తర్వాత పండగ ఎప్పుడయితే విద్యాసంస్థలకు ఆరోజు సెలవు ఉంటుంది. ముస్లిం మైనారిటీ విద్యాసంస్థలకు ఈ రెండ్రోజులు సెలవు ఉంటుంది. మార్చి 22న ఎలాగూ ఆదివారమే కాబట్టి సాధారణ సెలవు ఉంటుంది. అయితే తెలంగాణ ప్రభుత్వం రంజాన్ తర్వాతి రోజు కూడా అధికారిక సెలవుగా ప్రకటించింది... కానీ ఈ అవసరం లేకుండానే సెలవు వచ్చేస్తోంది. ఇలా గురువారం నుండి ఆదివారం వరకు వరుసగా నాలుగు రోజులపాటు ఇటు తెలంగాణ, అటు ఏపీలోని విద్యాసంస్థలకు సెలవులు వస్తున్నాయి. కేవలం తెలుగు విద్యార్థులకు కాదు ఉద్యోగులకు ఈవారం వరుస సెలవులు వస్తున్నాయి. ఉగాది, రంజాన్ కు ఉద్యోగులందరికీ సెలవులే... ఆదివారం ఎలాగూ సాధారణ సెలవే.ఆసక్తికరంగా రేపు (మార్చి 17,మంగళవారం) కూడా ఉద్యోగులకు ఓ సెలవు వస్తోంది. రంజాన్ మాసంలో ప్రతిరోజును ముస్లింలు పవిత్రంగా భావిస్తారు.. కొన్నిరోజులు మాత్రం చాలా ప్రత్యేకం. అలాంటిదే షబ్ ఇఖదర్... ఇది ఈ మంగళవారం వస్తోంది. అందుకే ఈరోజు ఆప్షనల్ హాలిడే ఇస్తోంది తెలంగాణ ప్రభుత్వం. ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు ఈరోజు వేతనంతో కూడిన సెలవు పొందవచ్చు. ఎగ్జామ్స్ నెల మార్చిలో భారీగా సెలవులున్నాయి. ఇప్పటికే హోలీ సెలవు వచ్చింది... ఇప్పుడు ఉగాది, రంజాన్ సెలవులు రాబోతున్నాయి. ఇక మార్చి 27న (శుక్రవారం) అంటే వచ్చేవారం శ్రీరామనవమి ఉంది... ఆరోజు కూడా అధికారిక సెలవే. మార్చి 31 (మంగళవారం) మహావీర్ జయంతి ఉంది ...ఈ రోజు ఆప్షనల్ హాలిడే ఇచ్చారు. ఇలా పండగలు, రెండో శనివారం, ఆదివారాలు కలుపుకుంటే మార్చి నెలలో సగంరోజులు సెలవులే ఉన్నాయి.



# క్యారవాన్‌లో అజిత్ చేసిన పనికి తమన్నా షాక్..

టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా తన అందం, అభినయంతో రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో రాణిస్తోంది. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలు, స్పెషల్ సాంగ్స్‌తో దూసుకుపోతున్న ఈ అమ్మడు.. తాజాగా ఒక కార్యక్రమంలో పాల్గొని తన సినీ ప్రయాణం, స్టార్ హీరోలతో తనకున్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. తమిళంలో తాను నటించిన 'కల్లూరి' సినిమా తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమని తమన్నా తెలిపింది. విద్యార్థులు తమ కాలేజీ జీవితాన్ని మనసారా ఆస్వాదించాలని, ఆ రోజులు మళ్లీ తిరిగి రావని ఆమె సూచించింది. తాను ఇండస్ట్రీకి వచ్చి 21 ఏళ్లు పూర్తి చేసుకున్నా, ప్రేక్షకులు ఇప్పటికీ తనను అదే స్థాయిలో ఆదరిస్తుండటం పట్ల భావోద్వేగానికి గురవుతూ అందరికీ ధన్యవాదాలు తెలిపింది. కోలీవుడ్ స్టార్స్ గురించి మాట్లాడుతూ.. విజయ్ చాలా నిరాడంబరమైన వ్యక్తి అని, ఆయనది మంచి మనసని కొనియాడింది. అంతేకాకుండా, విజయ్, ఎన్టీఆర్ ఇద్దరూ అద్భుతమైన డ్యాన్సర్లు అని కితాబిచ్చింది. ఇక అజిత్ గురించి చెబుతూ ఒక షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. 'వీరం' సినిమా షూటింగ్ సమయంలో అజిత్ స్వయంగా తన క్యారవాన్‌లో తనకు ఇడ్లీ చేసి పెట్టారని, ఒక స్టార్ హీరో అలా చేయడం చూసి తాను ఆశ్చర్యపోయానని చెప్పింది. ఆయన పర్ఫెక్ట్ ఫ్యామిలీ మెన్ అని, ఆయనకు వంట చేయడం అంటే చాలా ఇష్టమని ప్రశంసించింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గురించి తమన్నా ప్రత్యేకంగా మాట్లాడింది. "నా కెరీర్ ప్రారంభంలోనే ఆయనతో కలిసి పనిచేశాను. తెరపైనే కాదు, కెమెరా వెనుక కూడా ఆయన ఎంతో స్టైలిష్‌గా ఉంటారు. 15 ఏళ్ల క్రితమే ఆయన స్టైల్ వేరే లెవల్‌లో ఉండేది. ఈరోజు ఆయన సాధిస్తున్న విజయం చూస్తుంటే నాకు చాలా గర్వంగా, సంతోషంగా ఉంది" అని తన మనసులోని మాటను బయటపెట్టింది.



# భన్సాలీ కన్ను సాయిపల్లవిపైనే..

వైవిధ్యమైన పాత్రలు, సహజసిద్ధమైన నటనతో దక్షిణాదిన తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'నేచురల్ బ్యూటీ' సాయిపల్లవి. లేడీ పవర్ స్టార్ అని అభిమానులు ముద్దుగా పిలుచుకునే ఈ స్టార్ హీరోయిన్ ఇప్పుడు బాలీవుడ్‌లో వరుస ఆఫర్లతో దూసుకుపోతోంది. తాజా సమాచారం ప్రకారం, బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మించనున్న లెజెండరీ నటి మధుబాల బయోపిక్‌లో సాయిపల్లవి ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉన్నట్లు సమాచారం.గతంలో ఈ పాత్ర కోసం కియారా అడ్వాణీ, అనీత్ పడ్డా వంటి పేర్లు వినిపించినప్పటికీ, చివరికి భన్సాలీ బృందం సాయిపల్లవినే ఫైనల్ చేయాలని భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. అమీర్ ఖాన్ ప్రొడక్షన్‌లో జునైద్ ఖాన్‌తో కలిసి నటించిన 'ఏక్ దిన్' సినిమాతో త్వరలోనే ఆమె బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుంది. ఈ చిత్రం మే 1, 2026న విడుదల కానుంది. ప్రస్తుతం సాయిపల్లవి రణబీర్ కపూర్‌తో కలిసి 'రామాయణ' చిత్రంలో సీతగా నటిస్తోంది. దీనితో పాటు ధనుష్‌తో ఒక భారీ ప్రాజెక్ట్ చేస్తోంది. ఈ బయోపిక్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గతంలో 'పద్మావత్', 'గంగూబాయి కాఠియావాడి' వంటి చిత్రాలతో మహిళా పాత్రలను అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించిన భన్సాలీ, మధుబాల బయోపిక్‌ను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సాయిపల్లవి నటిస్తే, అది ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవడం ఖాయం అని ఆమె అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సినిమా కంపల్సరీ కాదు



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. పవన్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. పవన్ ఉప ముఖ్య మంత్రిగా పదవి స్వీకరించిన తర్వాత నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు ఏ సినిమా వారు టికెట్ ధర పెంపు కోసం ప్రభుత్వాన్ని కోరిన వాటికి అప్రూవల్ ఇస్తున్నారు. దానిపై కొంతమంది అలా ఎందుకు ఇస్తున్నారు అని పెద్ద స్థాయిలో రగడ చేస్తున్న వారు కూడా ఉన్నారు. తాజాగా పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో హీరోగా నటించాడు.

ఈ మూవీని మార్చ్ 19వ తేదీన విడుదల చేయనున్నారు. దానితో నిన్న రాత్రి ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దీనికి పవన్ కళ్యాణ్ కూడా అటెండ్ అయ్యారు. ఇప్పటికే ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రానికి కూడా టికెట్ ధరలను పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనిపై పవన్ కళ్యాణ్ తాజాగా స్పందించాడు. టికెట్ ధరలను పెంచుతున్నారు అని కొంతమంది అంటున్నారు. అలా పెంచడానికి ఒక కారణం ఉంది. సినిమా చూడడం అనేది తప్పనిసరి చేయాల్సిన పని కాదు. ఎవరూ కూడా మనల్ని గన్ పాయింట్ పెట్టి మొదటి రోజే సినిమా చూడండి అని చెప్పరు. టికెట్ ధరలపై పెంచిన 18 శాతం ప్రభుత్వానికే వెళుతుంది. పెంచకపోతే కొంతమంది బ్లాక్ టికెట్ల రూపంలో దానిని ఎక్కువ ధరకు అమ్ముతారు, అది ప్రభుత్వానికి రాకుండా వేరే వారికి వెళుతుంది అని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటించగా హరీష్ శంకర్ దర్శకత్వం వహించారు. మైత్రి సంస్థ వారు నిర్మించిన ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్, తమన్ సంగీతం అందించారు.



# నా కల నిజమైనట్లుగా అనిపిస్తోంది..

## రామ్ చరణ్ దంపతులకు బాలయ్య ప్రత్యేక

అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్నారు. 'తండేల్' సినిమాకు గాను 2025 ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్న చైతూ, ఇప్పుడు తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'వృషకర్మ' తో ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఇందులో ఆయన మునుపెన్నడూ చూడని విధంగా ఒక అడ్వెంచరస్ ట్రెజర్ హంటర్‌గా కనిపించనున్నారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న చైతూ ఈ సినిమా గురించి పలు ఆసక్తికర కామెంట్స్ చేశాడు. "నేను ఎప్పటి నుంచో ఒక భారీ స్థాయి మైథాలజీ కథలో భాగం కావాలని కోరుకున్నాను. మన దేశపు మట్టి కథలు, పురాణాల పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది. అత్యాధునిక సాంకేతికతతో ఈ అద్భుత ప్రపంచాన్ని తెరపై చూపించడం నా కల నిజమైనట్లుగా అనిపిస్తోంది" అని తన సంతోషాన్ని పంచుకున్నారు. ఇక ఈ పాత్ర కోసం చైతన్య తన లుక్‌ను పూర్తిగా మార్చేసిన విషయం తెలిసిందే.

తన రిప్డ్ ఫిజిక్ తో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేశారు. ఈ విషయంపై యాంకర్ ప్రశ్నించగా.. "నేను పర్సనల్‌గా ఫిట్‌నెస్‌ను బాగా ఇష్టపడతాను. గత సినిమాల్లో బాడీ చూపించే అవకాశం రాలేదు, కానీ ఇందులో ట్రెజర్ హంటర్ పాత్ర కావడంతో నా ఫిట్‌నెస్‌ను కూడా ఒక ఆయుధంగా వాడుకున్నాను" అని చైతన్య తెలిపారు. క్యూట్ నుంచి హాట్‌గా మారారనే కామెంట్స్ పై స్పందిస్తూ.. రెండింటిలో



నూ నేను 'రెలవెంట్' గా ఉండాలనుకుంటున్నానని అన్నారు. ఇక 'వృషకర్మ'కు సీక్వెల్ ఉంటుందా అన్న ప్రశ్నకు.. సమాధానమిస్తూ.. "మొదటి భాగం సక్సెస్ మీద సీక్వెల్ అనేది ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం నాగచైతన్య కామెంట్స్ వైరల్ అవుతుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా కనిపించనుంది.

# ఆమె చిరునవ్వు మరువలేనిది మ్యాజిక్ చేస్తుంది..

సూపర్‌స్టార్ కృష్ణ గారి వారసుడిగా, మహేష్ బాబు అన్న కొడుకు ఘట్టమనేని జయకృష్ణ వెండితెరకు పరిచయం కాబోతున్న సంగతి తెలిసిందే. 'మంగళవారం' 'ఆర్ఎక్స్ 100' చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'శ్రీనివాస మంగాపురం' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమా ద్వారా జయకృష్ణ టాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నటిస్తున్నారు. నేడు ఆమె పుట్టినరోజు కావడంతో, చిత్ర యూనిట్ ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఈ వీడియోలో రాషా చాలా అందంగా, డెబ్యూ హీరోయిన్‌కి ఉండాల్సిన అన్ని కళలతో కనిపిస్తోంది. అయితే ఇందులో ఈ భామ మంగ పాత్రలో నటిస్తోంది.

ఇక ఈ వీడియోను షేర్ చేస్తూ మేకర్స్ ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ జత చేశారు. "ఆమె చిరునవ్వు సరళమైనది, కానీ అందులోని మాధుర్యం మరువలేనిది.. కచ్చితంగా మ్యాజిక్ చేస్తుంది" అంటూ రాషా అందాన్ని, ఆమె నవ్వును పొగిడేశారు. కేవలం ఈ ఒక్క మాటతోనే సినిమాలో ఆమె పాత్ర ఎంత హుందాగా, క్యూట్‌గా ఉండబోతుందో హింట్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అది చూసిన ఘట్టమనేని అభిమానులు కూడా రాషాకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ, ఈ జోడీ కెమిస్ట్రీ చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అజయ్ భూపతి తన సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు చాలా ప్రాధాన్యత ఇస్తారు. ఈ క్రమంలోనే రాషా తడానీని టాలీవుడ్‌కు పరిచయం చేస్తుండటంతో, ఆమె పాత్ర చుట్టూనే కథ తిరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఘట్టమనేని ఫ్యామిలీ నుండి వస్తున్న మరో హీరో కావడంతో జయకృష్ణ డెబ్యూపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# కోలీవుడ్ డైరెక్టర్‌తో చేతులు కలిపిన రానా దగ్గుబాటి..

## 'నీలిర' సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్

టాలీవుడ్ సెన్సేషనల్ యాక్టర్ నవీన్ చంద్ర ప్రస్తుతం కెరీర్ పరంగా గోల్డెన్ పీరియడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. వైవిధ్యమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆయన, 'హనీ' వంటి హారర్ థ్రిల్లర్ తర్వాత ఇప్పుడు ఒక పవర్‌ఫుల్ ఎమోషనల్ కథతో ప్రేక్షకులను పలకరించనున్నారు. దర్శకుడిగా రాణిస్తున్న కార్తీక్ సుబ్బరాజు సమర్పణలో, రానా దగ్గుబాటి నిర్మాణంలో రాబోతున్న 'నీలిర' మూవీ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒక యుద్ధ బాలుడి చేదు జ్ఞాపకాల ఆధారంగా ఈ సినిమాను సోమేథరన్ తెరకెక్కించారు. శ్రీలంకలోని 'ఈలం' నేపథ్యంతో సాగే ఒక ఎమోషనల్ జర్నీని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. రానా దగ్గుబాటికి చెందిన 'స్పిరిట్ మీడియా, స్టోన్ బెంచ్ స్టూడియోస్ బ్యానర్స్‌పై ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండటం సినిమాపై అంచనాలను పెంచేసింది. కేవలం కమర్షియల్ హంగులే కాకుండా, మానవత్వానికి సంబంధించిన ఒక లోతైన కథను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తీసుకురాబోతున్నారు.

తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ కార్తీక్ సుబ్బరాజు ఎమోషనల్ అయ్యారు. "ఈలం కథను మెయిన్ స్ట్రీమ్ ప్రేక్షకులకు అందించడం నాకు చాలా గర్వంగా ఉంది. ప్రతి ఒక్కరి హృదయాలతో నిర్మించిన ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. మా కలని నిజం చేయడానికి సహకరించిన రానాకు థాంక్స్" అని ఆయన పేర్కొన్నారు. నవీన్ చంద్ర నటన ఈ సినిమాలో హైలైట్‌గా నిలవనుందని చిత్ర యూనిట్ నమ్మకంగా చెబుతోంది. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 3, 2026న 'నీలిర' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. గుడ్ ఫ్రైడే సందర్భంగా థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా, యుద్ధం మిగిల్చిన గాయాలను, జ్ఞాపకాలను తెరపై ఎలా ఆవిష్కరించబోతుందో చూడాలి. నవీన్ చంద్ర మరోసారి తన నటనతో బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

